# కూటమి పాలనంతా మాయ, మోసం

- వైఎస్సార్‌సీపీ కంచిలి మండల విస్తృత స్థాయి సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ


బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు


ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల కమిటీ ప్రతినిధులు

కంచిలి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో అంతా మాయ, మోసం మాత్రమే కనిపిస్తున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ విమర్శించారు. కంచిలిలోని రాధాక్రిష్ణ ఆలయం ఆవరణలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ విస్తృతస్థాయి సమావేశాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. కూటమి పాలనకు, జగనన్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ఆమె వివరించారు. 15 నెలల పాలనలో ఇచ్చిన హామీలేవీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకోలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ క్యాడర్ అంతా గ్రామస్థాయిలో చంద్రబాబు పరిపాలనలో చేసిన మాయ, మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. దీనికోసం ప్రత్యేకమైన కార్యాచరణను పార్టీ రూపొందించిన ప్రకారం అంతా ఐక్యంగా ముందుకెళ్దామన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేసిన అభివృద్ధి, కూటమి సర్కార్ 15 నెలల్లో చేసిన అభివృద్ధి ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. ఇచ్ఛాపురం పట్టణ ముఖద్వారంగా ఉన్న బ్రిడ్జి కూలిపోతే వైఎస్సార్‌సీపీ హయాంలో వెంటనే తాత్కాలిక నిధులు తెప్పించి నిర్మించామన్నారు. అయితే పక్కా బ్రిడ్జి నిర్మాణానికి కూటమి పాలనలో ఇంతవరకు మోక్షం కలుగలేదని విమర్శించారు. సోంపేట మండలం బారువ కొండిరేవు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తీసుకొస్తే, వాటిని ఈ ప్రభుత్వం రద్దుచేసి, మళ్లీ కొత్తగా మంజూరు చేసి తాము తెచ్చామని చెప్పుకోడానికి ప్రయత్నిస్తుండటం సిగ్గుచేటన్నారు. ఉద్దానం వాటర్ ప్రాజెక్టును జగనన్న రూ. 700 కోట్లతో హిరమండలం నుంచి ఇచ్ఛాపురం మండలం వరకు తాము తీసుకొస్తే.. ఎటువంటి ఎంవోఈ లేకుండా అక్రమంగా ఆ నీటిని ఇచ్ఛాపురం పట్టణానికి మళ్లించి అదివారిగొప్పగా ఎంపీ రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే అశోక్‌లు చెప్పు కోడం దారుణమన్నారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరించారు. మండల పార్టీ కమిటీతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు బతకల మోహనరావు, పార్టీ నేతలు లద్దు కేశవపాత్రో, గుమ్మిడి రామదాసు, దుర్గాసి ధర్మారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

**పావలా పనికి రూపాయి పబ్లిసిటీ**

కూటమి ప్రభుత్వ హయాంలో పావలా పనిచేసి రూపాయి పబ్లిసిటీ చేసుకుంటున్నారు. ఇచ్ఛాపురం నుంచి టీడీపీ తరఫున మూడుసార్లు ఎన్నికైన బెందాళం అశోక్ చేసిన అభివృద్ధి శూన్యం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ చేసిన అభివృద్ధి చాలా ఎక్కువ.

–సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

**ఐక్యంగా పనిచేద్దాం**



ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం దిశగా తీసుకెళ్లేందుకు అన్నిస్థాయిల్లో క్యాడరంతా ఐక్యంగా పనిచేద్దాం. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిపక్ష పాత్రను బాధ్యతగా నిర్వహిద్దాం. ప్రజలకు అండగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలని బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనికి అంతా కట్టుబడి ప్రజలకు చేరేలా కృషి చేయాలి.

–పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే నిజాలు తెలుసుకొని మాట్లాడాలి**

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ నిజాలు తెలుసుకొని మాట్లాడాలి. కంచిలి పీఏసీఎస్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం సభలో గత ప్రభుత్వంలో పీఏసీఎస్‌లో రూ. 20 కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం తగదు. ఎక్కడ అవినీతి జరిగిందో నిరూపించాలి. మండల సమావేశాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తామని పార్టీ ప్రకటించిన తర్వాత అక్కడ మహిళా సెక్రటరీకి బెదిరించి అనుమతులు ఇవ్వకుండా చేశారు. ఇది రెడ్‌బుక్ పరిపాలనకు నిదర్శనం.

–దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి


సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

# చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరించాలి

- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం


క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు

కాశీబుగ్గ:

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ–పలాస మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు శిష్టు గోపి అధ్యక్షతన స్థానిక కీర్తన ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. అలాగే వితంతువులకు సైతం పింఛన్ మంజూరు చేయకపోవడంతో అర్హులైన చాలామంది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 15 ఏళ్లు నిండిన ఆడబిడ్డకు రూ.1500, నిరుద్యోగభృతి వంటి బూటకపు హామీలతోనే చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పటికీ సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేశారన్నారు. ఈ విషయాలన్నీ ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించి వారిని చైతన్య పరచాలన్నారు. హామీలపై ప్రశ్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి బెదిరింపులకు పాల్పడడం దేశ చరిత్రలోనే ఎక్కడా లేదన్నారు. ప్రజలు నోరెత్తితే అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. ప్రజలను చైతన్య పరిచేందుకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డులో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఇటీవల సర్వేలో 98 మంది ఎమ్మెల్యేలకు టిక్కెట్లు దక్కే పరిస్థితి లేదని చంద్రబాబే చెప్పారని.. అందులో మొదటి స్థానంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఉన్నారన్నారు. చెరువులు, శ్మశాన వాటికలు, చెరువులు, గుట్టలను అధికార పార్టీ నాయకులు తవ్వేస్తున్నారని ఆరోపించారు. పలాస చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మట్టి, ఇసుక అక్రమంగా తరలించే వాహనాలకు స్టిక్కర్లు అతికించి విక్రయించి బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. స్టిక్కర్లు అతికించిన వాహనాల వైపు పోలీసులు, రెవెన్యూ, ఇతర ఏ శాఖల అధికారులు కన్నెత్తి చూడటం లేదని అన్నారు. ఇప్పటికే ప్రతీ మద్యం బాటిల్‌పై పది రూపాయలు లోకల్ టాక్స్ విధించిన వారు తన కోసం మాట్లాడే అర్హత లేదన్నారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు కాకుండానే మాటలు కోటలు దాటాయన్నారు. అదిగో పులి ఇదిగో మేక అన్నట్లు కేంద్రీయ విద్యాలయం పేరు చెప్పి సూదికొండను బోడికొండగా మార్చి అక్కడ స్థలాన్ని అక్రమించుకున్నారని మండిపడ్డారు. కేటీరోడ్ విస్తరణ చేస్తే ఇప్పుడు ఫుట్‌పాత్‌పై టిఫిన్ కొట్లు నడుపుకుంటున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రూ.700 కోట్లతో ఇంటింటికీ శుద్ధ జలాలు, రూ. 85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ తెచ్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కిడ్నీ ఆస్పత్రిలో ప్రస్తుతం అనేక సమస్యలు చుట్టుముడితే కూటమి నాయకులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల క్యూఆర్ కోడ్ కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు హనుమంతు వెంకటరావు, మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, పి.హరి, పి.వి.సతీష్, దుర్గాశంకరపండా, బోర చంద్రకళ, గుజ్జు జోగారావు, పైల చిట్టి, ఉంగ సాయి, డొక్కరి దానయ్య, తూముల శ్రీనివాసరావు, బెల్లాల శ్రీను, పప్పల ప్రసాద్, దున్న సత్యం, జోగి సతీష్, బమ్మిడి దుర్యోధన, గౌరీ త్యాడి, శర్వాణ గీత, బత్తిని హేమేశ్వరరావు, పానిల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పట్టణ నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

## క్లుప్తంగా

### డిప్యూటీ ఎంపీడీవోగా తిరుమలకుమార్



మందస: మందస డిప్యూటీ ఎంపీడీవోగా ఎ.తిరుమల కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం డ్వామాలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఈయన ప్రమోషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన వరప్రసాద్ ఉద్యోగోన్నతిపై కవిటి డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. కాగా తిరుమలకుమార్‌ను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

### సీతయ్య ఫౌండేషన్ ప్రతినిధులకు సత్కారం


ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న రమేష్, మోహన్

కంచిలి: మండపల్లి గ్రామంలో సేవలందిస్తున్న సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, మోహన్‌లను విజయవాడ సిద్దార్థ కాలేజీ ఆవరణలో మనోబంధు సంస్థ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ మేరకు సీతయ్య ఫౌండేషన్ వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక ఒత్తిడిలో కుంగిపోయి, తెలియని అనిశ్చితిలో కుటుంబ సభ్యులకు దూరమై, జాతీయ రహదారుల వెంబడి అనామకులుగా తిరుగాడుతున్న మానసిక దివ్యాంగులకు అండగా నిలుస్తున్న సంస్థ సేవలకు గుర్తింపుగా ప్రతినిధులను సత్కరించి అభినందించారు.

### నాయకుల పరామర్శ


శ్యామ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కవిటి: జగతి పంచాయతీ చిన్నమెళియాపుట్టుగకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎర్ర శ్యామ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కడియాల ప్రకాష్ నాయకులతో కలిసి మృతుని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, ఎంపీటీసీ పూడి నీలాచలం, జగతి వైస్ సర్పంచ్ బోను సహాలాలపుట్టుగ సర్పంచ్ ప్రతినిధి రవి, ఎంపీటీసీ ప్రతినిధి మురళి ఉన్నారు.

## కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్‌కు పరామర్శ


హారికను పరామర్శిస్తున్న నరేంద్ర యాదవ్, ప్రేమ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ శనివారం పరామర్శించారు. పార్టీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో కలిసి ఆమెను పరామర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై దాడులు చేసే సంస్కృతి కూటమి ప్రభుత్వంలో మాత్రమే జరుగుతోందన్నారు. బీసీ మహిళని చూడకుండా హింసాత్మక వాతావరణాన్ని సృష్టించారని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు చేదాటిపోతున్న నేపథ్యంలో మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్, రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. పరామర్శలో ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

## నేడు కవిటిలో వైఎస్సార్‌సీపీ సమావేశం


కవిటి: మాట్లాడుతున్న కడియాల ప్రకాష్

కవిటి: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా మోసగించిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ చేపడుతున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ మండల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం కవిటిలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్ శనివారం తెలిపారు. స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘం భవనంలో చేపడుతున్న సభా ఏర్పాట్లను జేసీఎస్ మండల కన్వీనర్ జల్లు యుగంధర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉదయం తొమ్మిది గంటలకు కవిటి అగ్నికుల క్షత్రియ భవనంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీకి చెందిన అన్ని విభాగాల ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, నాయకులు పూడి నీలాచలం, పీఎం తిలక్, పినింటి జయరావు, నారాయణ స్వామి, వై.నీలయ్య, బోస్ పాల్గొన్నారు.

## నేడు వైఎస్సార్‌సీపీ మండలస్థాయి సమావేశం

టెక్కలి: బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ప్రచారంలో భాగంగా ఆదివారం టెక్కలిలో మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ హనుమంతు వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ జంక్షన్ సమీపంలోని శుభం కన్వెన్షన్ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రారంభం కానున్న సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## రూ. 1.56 లక్షల ఆర్థిక సాయం


సాయాన్ని అందజేస్తున్న సేవా సంఘం సభ్యులు

కంచిలి: జాడుపూడి గ్రామానికి చెందిన కొయ్య మన్మథరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కాళీ దుర్గామాత సేవా సంఘం సభ్యులు స్పందించి రూ. 1.56 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేసి అండగా నిలిచారు.

## పగటిపూట భారీ వాహనాలకు ప్రవేశం లేదు

- కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ


సూర్యనారాయణ


కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లోకి పగటిపూట భారీ వాహనాలకు ప్రవేశం లేదని కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. జంట పట్టణాల్లోనికి ఉదయం ఏడు నుంచి రాత్రి పది గంటల వరకు ఎటువంటి భారీ వాహనాలను ప్రవేశం కల్పించడం లేదని పేర్కొన్నారు. రాత్రి పది నుంచి ఉదయం ఏడు గంటల్లోపు రాకపోకలు జరుపుకోవచ్చునని అన్నారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థుల రాకపోకలు అధికంగా ఉంటాయని..ఈ నేపథ్యంలో ఇటువంటి నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు వివరించారు. టోల్‌గేటు తప్పించుకోవడానికి ఇతర ప్రాంతాలకు చెందిన వాహనాలు అధికంగా జంట పట్టణాల్లోకి వస్తున్నాయని..ఇకపై అటువంటి వాహనాలకు ప్రవేశం కల్పించమని స్పష్టం చేశారు. సాయంత్రం రెండు నుంచి నాలుగు గంటల వరకు అత్యవసర వాహనాలను మాత్రం విడిచి పెడతామన్నారు. భారీ వాహనాలు జంట పట్టణాల్లోకి ప్రవేశిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురణ కావడంతో జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో కాశీబుగ్గ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

## రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవీంద్ర

సోంపేట:ఉప్పలాం పంచాయతీ భట్టిగళ్లూరు గ్రామం నుంచి ఎకువూరు గ్రామానికి రూ. 94 లక్షల ఉపాధి నిధులతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణానికి మంత్రి కొల్లు రవీంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బి.అశోక్‌తో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి రాజు, సూరాడ చంద్రమోహన్, మద్దిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల నిరసన


నిసనలో మున్సిపల్ కార్మికులు

ఇచ్ఛాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు కోరారు. ఈ మేరకు మూడో రోజైన శనివారం ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.

## వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



నందిగాం: దిమ్మడిజోలకు చెందిన సలాన డిల్లేశ్వరరావు అదృశ్యమైనట్టు కుమారుడు తిరుపతిరావు ఫిర్యాదు చేశారని ఏఎస్సై కె.చిన్నారావ తెలిపారు. ఈ నెల 12న టెక్కలి ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ నుంచి శ్రీకాకుళం గాయిత్రి కాలేజీలో చదువుతున్న మనవుడు వద్దకు వెళాడు. అక్కడ నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో వెతికినప్పటికీ ఆచూకీ తెలియ రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

## మలుపుతో ప్రమాదాలు..



కోటబొమ్మాళి మండలం కన్నేవలస జంక్షన్ నుంచి కోటబొమ్మాళి గ్రామంలోకి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో ఉన్న భారీ మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి వెంబడి పోర్టుకు భారీ వాహనాలు వెళ్తుండడంతో రోడ్డు మరింత పాడైంది. భారీ వాహనాల రాకపోకలు వలన ఈ రహదారి పూర్తిగా పాడైపో నిత్యం ప్రమాదాలకు కారణమౌతుందని స్థానికులు వాపోతున్నారు సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు పాడైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

## అవగాహన ర్యాలీ



పర్యావరణానికి కీడు కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించే విధంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సుజాత కోరారు. ప్లాస్టిక్ నియంత్రణపై శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్, పాలిథిన్ ఉత్పత్తులు వినియోగించకుండా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో అలివేలు, ఎంపీడీవో కార్యాలయం ఏవో కె.సింహాద్రి, పంచాయతీ ఈవో ఎ.వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

–టెక్కలి


## నూతన కార్యవర్గం



ఏపీ ఎస్‌జీటీయూ ఉపాధ్యాయ సంఘం టెక్కలి శాఖా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఎస్.పోలినాయుడు, అధ్యక్షునిగా ఎన్.సురేష్ కుమార్, సహాధ్యక్షులుగా జె.జనార్దనరావు, ఉపాధ్యక్షులుగా కె.వేణుగోపాల్, కె.శంకరరావు, ఎస్.భారతి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రమణారావు, అధనపు కార్యదర్శిగా బి.అనురాధ, కార్యదర్శులుగా బి.వసంతరావు, జి.సరోజిని, ఆర్.తవిటి నాయుడుతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.నేతాజీరావు పాల్గొన్నారు.

–టెక్కలి

## బెస్ట్ క్రియేటివ్ ఆర్ట్ అవార్డుకు ఎంపిక


అవార్డు తెచ్చిపెట్టిన చిత్రం

నందిగాం: పెద్దతామరాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మార్పు నారాయణమూర్తికి రాజమండ్రికి చెందిన క్రియేటివ్ హార్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలలో బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు వరించింది. ఈ మేరకు నారాయణమూర్తికి క్రియేటివ్ హార్ట్స్ అధినేత అంజి ఆకొండి నుంచి శనివారం సమాచారం వచ్చింది. ఈ పోటీలు ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో వీరోచితంగా పోరాడిన మన సైనికులకు గౌరవ వందనం అందించేందుకు గాను నిర్వహించామన్నారు. అవార్డును వచ్చే నెలలో ప్రదానం చేయనున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో సుమారు 300 మంది పాల్గొనగా నారాయణమూర్తికి అవార్డు రావడం పట్ల పాఠశాల సిబ్బంది ఆనందనం వ్యక్తం చేశారు.